# 1. ఎర్ర గీతల తెల్ల బంతి

ఆకాశం అందరి ఆస్తి. చుక్కలు అందరి హక్కు. వెన్నెల అందరి సొత్తు. గాలి అందరి సంపద. సూర్యుడు అందరి సొంతం.

అయితే, ఆ ఇంటి గోడదాటి, రాయి దగ్గర రోడ్డు మీద ఆగిపోయిన ఎర్ర గీతల తెల్ల బంతి రవిది కాదు. అది రవి అన్నయ్య గిరిదీ కాదు. అది ఆ ఇంటి రాజారావు గారి కొడుకు సంపద కుమార్‌ది మాత్రమే!

ఆ ఇంటి గోడలు ఎత్తుగా వున్నాయి. ఆ ఇల్లు మూడంతస్తుల భవనం. ఆ ఇల్లు ఎత్తుగా, విశాలంగా వుండి, ఎగురుతున్న సముద్ర కెరటాల్ని, పలకరిస్తుంది. ఆ ఇల్లు అందంగా వుండి, ఎదురుగా, యవ్వనంగా వున్న, రంగు రంగుల పూల మొక్కలికి, పాటలు నేర్పుతుంది.

మెత్తని వాణ్ని చూస్తే మొత్తాలనిపిస్తుంది. బంతినిచూస్తే తన్నాలని పిస్తుంది. అంచాత, అప్పుడే బడినుంచి తిరిగి వస్తున్న రవి, చేతిలో వున్న పుస్తకాలు, పేవ్‌మెంటు మీద వుంచి, మెత్తని వాడైన గిరిని మొత్తి, ఆ బంతిని గట్టిగా కాల్తో తన్నాడు.

ఆ బంతి ఎత్తుగా ఎగిరి, ఎంతో దూరం పోయింది. అదిచూసి, రవి తప్పట్లు కొడుతూ, వుత్సాహంగా గెంతి, ఆ ఇంటివైపు చూసాడు.

సంపద కుమార్, రవిని చూసాడు. ఎత్తుగా ఎగిరి, ఎంతో దూరం పోయిన, బంతిని చూసాడు. అది చూసిన సంపదకుమార్‌కి కోపం వచ్చింది. అతడి బుగ్గలు ఎర్రబడ్డాయి. అతడి మొహం చెమట్లు పట్టింది. అప్పుడతడు, గేటు లోపలనుంచే, 'ఎవడ్రా వెధవా నా బంతిని తన్నాడు!' అని కేక వేసి, అరిచాడు. గొల్సుకి కట్టి వున్న కుక్క, అంత కన్నా పెద్దగా అరిచింది.

'నేన్రా, వెధవా!' అని రవి కెవ్వున కేక వేసి ఆ బంతిని రెండు చేతుల్తో పైకెత్తి, గేటులోపల గొల్సుకి కట్టి వున్న కుక్క మీదకు విసిరి, పారిపోయాడు.

* * *

'ఒరేయ్! రవీ! నువు చాలా పెంకితనం చేస్తున్నావ్రా! దెబ్బలాట్లు తెస్తున్నావ్రా! మన రోజులు బాగులేవు రా! మనం దరిద్రంతో కుళ్లి ఛస్తున్నాంరా ! నువు తెచ్చే దెబ్బలాటలతో, నా తల పగిలిపోతోంది రా! మీ కోసమే నేను బతుకు తున్నాన్రా! నన్ను బతకనీరా! ఇంకెప్పుడైనా, ఎవళతోనైనా, దెబ్బలాటలు తెస్తే, నీ కాళ్లూ - చేతులూ విరిచి, పారేస్తాన్రా! ' అని, అమ్మ మాటలు

గిరికి బాగా బుర్రకి పట్టాయి. అంచాత, వెంటనే రవిని ఛళ్ళున చెంపకాయ కొట్టాడు. 'అమ్మ చెప్పిన మాటలు మర్చిపోయావా?' అని మరో చెంపకాయ కొట్టాడు.

అయినా, రవి ఏవీ పట్టించుకో లేదు. 'నా కలాంటి బంతి కావాలి!'అని చెప్తూ, వుత్సాహంగా, గంతులు వేస్తూ, ఇంటి వేపు నడిచాడు. ఆ ఇల్లు, ఆ పట్నం చివర, గెడ్డ ఒడ్డున వుంది. అది చిన్న పాక ఇల్లు. ఆ ఇంటికి తడికలు కట్టి, రెండు వాటాలుగా చేసారు. ఒక వాటాలో – ఆ ఇంటి యజమానీ, అతడి కుటుంబంలోని ఎనమండుగురూ, వుంటున్నారు. రెండో వాటాలో - లారీ డ్రైవరు కాంతారావు, అద్దె కున్నాడు. ఇప్పుడతడు జైల్లో వుంటున్నాడు. అంచాత, అతడి భార్య కాంతం, ఇద్దరు పిల్లలు- రవీ- గిరీ - మాత్రమే వుంటున్నారు.

కాంతారావుకి చాలా మంచి వాడని పేరుంది. తెగ తాగే డ్రైవర్లలో, అసలు తాగని డ్రైవరుగా, పేరుంది. తన పిల్లల జీవితం తన జీవితం లా వుండకూడదని అంటూ వుండేవాడు. వాళ్ళని బాగా చదివించాలని, కడుపు కట్టుకుని, కాన్వెంటులో చేర్పించాడు. ఏ వ్యసనాన్నీ దగ్గరికి చేరనీకుండా, చక్రాన్ని తిప్పుతూ, బతుకుతున్నాడు.

అయితే, ఒక రోజున ప్రమాదం జరిగింది. ఓ కారు బారు నుంచి వస్తూ, లారీని ఢీ క్కొంది. ఆ ప్రమాదంలో, ఓ కుర్రాడు చచ్చి పోయాడు. అంచాత, కాంతారావు, ఇంట్లో గాకుండా జైల్లో వుంటున్నాడు. ఆ నాటి నుండీ - కాంతం కన్నీరు కారుస్తూ బతుకుతూంది. భర్త సంపాదిస్తున్నప్పుడే, రోజులు గడవడం చాలా కష్టంగా వుండేవి. ఆ సంపాదన కూడా లేక పోవడంతో - ఆమె జీవితం అతి దుర్భరమయి పోయింది. అవుసరానికి ఆదుకునే వాళ్ళు, ఎవ్వరూ లేక పోయారు.

పిల్లల్ని కాన్వెంటు చదువు మాన్పించి, మామూలు బడిలో చేర్పించింది.

అప్పుడామె, పొట్ట పోషణ కోసం, చిన్న టీ కొట్టు పెట్టింది. అక్కడ కొత్త ఇళ్ళు లేస్తూ వుండేవి. అంచాత, ఆ కూలీలందరూ, అక్కడే టీ తాగుతూ వుండేవాళ్ళు, అలా అమె, ఆకలి ఆకలిగా, దిగులు దిగులుగా, రోజులు గడుపుతోంది.

అయితే- పనీ - పాటూ లేని ఇద్దరు పోకిరీ కుర్రాళ్ళు, టీ కోసం రోజూ వస్తూ వుండేవాళ్ళు. పావలా టీ తాగి, గంటల సేపు అక్కడ కబుర్లాడే వాళ్ళు. సూటీ పోటీగా సరసాలాడేవాళ్ళు. అంచాత, ' మెగుడు జైల్లో వున్నా, జమానుల్లాంటి ఇద్దరు తెగ బలిసిన మొగోళ్ళున్నారు! దానికేం నోటు!' అని గుసగుసలు బయల్దేరాయ్.

ఆ గుసగుసలు, ఆ ఇంటి ఓనరు చెవుల్లో పడ్డాయ్. ' బుల్లెమ్మా, నానీ సెడ్డ పేరు బరించనేను,! ఎంటనే ఇల్లు ఖాళీ సేసీ, తల్లీ! ' అని అతడు ఇల్లు వెంటనే ఖాళీ చెయ్యమన్నాడు.

అయితే - అప్పుడామె ఇల్లు ఖాళీ చెయ్యలేదు గానీ, టీ కొట్టు మూసివేసింది.

'ఇంక బతకడమెలా?! ' అని ఆమె నెత్తీ - నోరూ - మొత్తుకుని, దిక్కు తోచక విలపిస్తోంది. అప్పుడే రవీ - గిరీ వచ్చారు.

రవి, వచ్చిన వెంటనే ఆమెను చుట్టి వేసాడు. 'అమ్మా! నాకు బంతి కొనవే! ఇవాళో బంతిని చూసానమ్మా! ఆది ఎర్ర గీతల తెల్ల బంతి! కాల్తో తంతే, గాల్లో ఎగిరి, ఎంతో దూరం పోయింది! అలాంటి బంతి ఇవాళే నాకు కావాలి! కొనమ్మా! ' అని దీనంగా చూస్తూ, అల్లరి మెదలెట్టాడు.

అప్పుడే - రవి చేసిన అల్లరి - గిరి చెప్పాడు. ఆమె ఎన్ని విధాలుగా చెప్పినా, రవి బంతి కోసం అల్లరి చేస్తూనే వున్నాడు.

ఆమె విసిగి పోయింది. ఆమె మనసు వికలమై పోయింది. ఆమె కోపం పట్టలేక పోయింది. వెంటనే, చీపురు కట్ట తీసుకుని, వొళ్ళు తెలీకుండా, రవిని కొట్టింది.

రవి ఏడ్చి ఏడ్చి, అల్సి పోయి - నిద్ర పోయాడు. ఆ తర్వాతర్వాత ఆమె కన్నీరు బొట బొటా కారుస్తూ రవి పక్కన కూర్చుంది.

గిరి ఏమీ తోచక, బొమ్మలా వుండిపోయాడు.

* * *

ఉన్నట్లుండి పెనుగాలి వీచడం ప్రారంభమయింది. ధూళి రేగడం ఆరంభమయింది. చినుకులు పడ్డం మెదలయింది. అది గాలి వానగా మారింది.

ఆ ఇంటి మీది తాటికమ్మలు ఎగిరి పోతున్నాయ్. వాన గదిలో పడుతోంది. గదంతా తడిసి పోతోంది.

చలిగాలి గడగడ వణికిస్తోంది. అప్పుడే రవి గడగడ వణుకుతున్నాడు. రవికి జ్వరం వచ్చింది. ఆ చలి గాలికి జ్వరం ఎక్కువవుతోంది. ఆమె దడదడలాడుతోంది. చింకి చీర మూడు మడతలు పెట్టి రవికి కప్పింది. రవిని గుండెలకు అదుముకుని, పడుకుంది.

ఆ వొళ్ళు తెలీని జ్వరంలో రవి బంతి కోసం కలవరిస్తున్నాడు. ఆమె కుమిలి పోతోంది. ఆమె భయంతో - దిగులుతో - క్రుంగి పోతూంది.

* * *

తెల్లవారింది. వాన మాత్రం తగ్గలేదు. రవికి జ్వరం ఎక్కువవుతూంది గానీ తగ్గలేదు.

చేతిలో డబ్బు లేదు. అంచాత, ఆమె ఆ వానలో బయలు దేరి, రాజారావు గారి ఇంటికి వెళ్లింది. ఆమె రెండు చేతులూ జోడించి, ఆయన ముందు నిలబడింది. ' బాబుగారూ, నా భర్త కాంతారావు మీ దగ్గర చాకా కాలం పని చేసాడు. మా రోజులు బాగోలేవు. అతడికి జరిగిన అన్యాయం తమకు తెల్సు. ఇంట్లో పిడి కెడు నూకలు లేవు. మా కుర్రాడికి జ్వరం ఎక్కువగా

వుంది. మంచం మీంచి లేవ లేదు. చేతిలో డబ్బులేదు. ఎభై రూపాయలు అప్పు ఇప్పించండి. ఆయన కొద్ది రోజుల్లో ఇంటికి తిరిగి వస్తారు. మీ డబ్బు తిరిగి ఇచ్చి వేస్తాం. నన్నూ - నా బిడ్డల్నీ ఆదుకోండి.' అని ఆమె, వినయంగా, దీనంగా అప్పు అడిగింది.

రాజారావు ఆమె చెప్పింది విన్నాడు. 'కాంతారావు వల్ల నేనెంతో నష్టపోయాను! నేనింక ఏమీ ఇవ్వలేను', అని వెంటనే జవాబు చెప్పి, గిర్రున వెనక్కి తిరిగి, వెళ్లి పోయాడు.

* * *

ఆమె కన్నీరు కారుస్తూ - క్రుంగి పోతూ - నిస్సహాయంగా - వెనక్కి తిరిగింది. పది అడుగులు వేసింది. అప్పుడామె సన్నజాజి పొదల పక్కన పడివున్న, ఓ ఎర్ర గీతల తెల్ల బంతిని చూసింది. అమె కళ్లు మెరిసాయ్.

'ఈ బంతి తీసుకు వెళ్లి రవికిస్తాను! ఇది చూచి వాడు దిగ్గున లేచి కూర్చుంటాడు! వాడికి జ్వరం తగ్గి పోతుంది!' అని ఆమె అనుకుంది. అలా అనుకుని ఆ బంతి తీసింది. చీర కొంగులో దాచింది. గబ గబా రెండడుగులు ముందుకు వేసింది.

అంతలో కుక్క అరిచింది. రాజారావు వెనక్కి తిరిగి చూసాడు. ఆమె చీర కొంగులో వున్న బంతిని చూసాడు. ఆ తర్వాత కేకలు వేసాడు.

అంతలో - ఓ పనివాడు వచ్చి, బంతిని లాక్కున్నాడు. ఆమె తూలి పోయి వెనక్కి పడిపోయింది.

* * *

ఆమె స్పృహ తప్పి పడిపోయింది! రవి జ్వరంతో మూల్గుతున్నాడు!

గిరి కన్నీరు కారుస్తూ, అమ్మ కోసం ఎదురు చూస్తూ, రవి పక్కన కూర్చున్నాడు.

( ఆంధ్ర జ్యోతి - సచిత్ర వార పత్రిక - 30-10-1970)

# 2. కుర్ర కుక్క

ఆ రోజు మిట్ట మధ్యాహ్నం వేళప్పుడు, ఆ కుర్ర కుక్క కారులోంచి హుందాగా బయటకు గెంతింది. ఠీవిగా, జోరుగా మేడ మీదకు పరుగెత్తింది. వయ్యారంగా గదిలోకి వెళ్లింది. శృంగారంగా మెత్తని పరుపులున్న పట్టె మంచం ఎక్కింది. సిల్కు కర్టెన్లలో బుర్ర పెట్టి, కిటికీ లోంచి విలాసంగా పైకి చూసి కిందికి కూడా చూసింది.

ఆ కిటికీ లోంచి కిందికి చూస్తే, ఆ ఇంటి ఔట్ హౌస్ కనబడుతుంది. అది ఆ ఇంటి ప్రహారీ గోడ మీద - మరో పిడికెడు ఎత్తు కట్టి, తాటి కమ్మలు వేసి, లేవదీసిన పెంకుటిల్లు. ఆ ఇంట్లో - నిలువుగా వేసుకుంటే ఒక చిన్న మంచం, అడ్డంగా వేసుకుంటే రెండు చిన్న మంచాలూ పట్టే ఒక గది, చిన్న పంచాది మాత్రమే వున్నాయ్. ఆ ఇంట్లో నెలకి వంద రూపాయలు అద్దె చెల్లిస్తూ చిట్టిబాబు వుంటున్నాడు.

ఆ కిటికీ లోంచి కిందికి చూసిన కుక్క, కుర్ర కుక్క. అది ఇంగ్లీషు సినిమాలు చూస్తుంది. నగ్న నృత్యాలు వీక్షిస్తుంది. విందు భోజనాలకి వెళ్తుంది. కారులో వెళ్లి దేవాలయాలు దర్శిస్తుంది. అలా, ఆనందంగా, వైభవంగా ఆధ్యాత్మికంగా, శృంగార విలాస భరితంగా - ఆ కుక్క జీవితాన్ని గడుపుతోంది.

* * *

చిట్టి బాబు, చిట్టి గుమస్తా. అతడు ఒట్టి గుమస్తా. అతన్ది గుమస్తా బతుకు. అతన్ది గొర్రె తోక జీవితం. అతన్ది అప్పుల బతుకు. అతన్ది బాధల బతుకు. అతన్ది భయం బతుకు. అతన్ది మేక బతుకు.

అతన్ది ఏడ్వ లేక నవ్వే - చావ లేక బతికే - శోక పూరిత, బాధా భరిత జీవితం.

గాలీ - వెల్తురూ లేని చీకటి గదిలో బంధింపబడిన, చీకటి బతుకు అతన్ది. చావు సవ్వడుల్లా - టపటప మని చినుకులు రాలే గదిలో - తల దాచుకుంటున్న జీవితం అతన్ది.

ఆయితే - అతని జీవితంలో - కష్టాల రాపిడి లోంచి పుట్టుకు వచ్చిన కమనీయత వుంది. బాధల ఆరాటంలో వూరిన చల్లని నీరు వుంది. అక్రమరహితమైన - న్యాయ బద్ధ మయిన జీవితం వుంది. జీవిత పోరాటంలో గెలుస్తున్న నిజాయితీ వుంది. అతని జీవితంలో సంస్కృతి వుంది. సాహిత్యం వుంది. కళలున్నాయి. సంసార మాధుర్యం వుంది. అతడు గులాబీ మొక్కల్లో